

మా భూమి మాకు ఇప్పించండి సారూ..
దళితుల భూములను ఓ టీడీపీ నాయకుడు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని.. తమ భూములు ఇప్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. - 8లో..



కాపురాల్లో సెల్ చిచ్చు
తన భార్యకు మరో వ్యక్తి సెల్‌ఫోన్ కొనిచ్చాడని ఆగ్రహానికి గురైన భర్త బంధువులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. రేకుల షెడ్, ఆటో, రెండు బైక్‌లకు నిప్పు పెట్టారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/21

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

కళ్లలో ఇసుక కొట్టి.. రాళ్లు కొల్లగొట్టి..



సంగమేశ్వరం ప్రాజెక్టు వద్ద నిల్వ చేసిన ఇసుకను సగానికి పైగా కాజేసిన దృశ్యం

ప్రకృతి వనరులను అధికార టీడీపీ నేతలు చెరబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకున్నారు. జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉంచిన రాళ్లు, ఇసుకను బొక్కేశారు. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహించడంతో ప్రభుత్వ సొమ్మును యథేచ్ఛగా కొల్లగొట్టేశారు. దాదాపు రూ.3 కోట్లు మింగేశారు.

- రూ.3 కోట్ల ఇసుక, రాళ్లను మింగేసిన తెలుగు తమ్ముళ్లు
- చెన్నిపాడు సంగమేశ్వరం ప్రాజెక్టు వద్ద దోపిడీ పర్వం
- ప్రాజెక్టు నిర్మాణానికి 50 వేల టన్నుల ఇసుక, భారీగా రాళ్లు నిల్వ
- రాత్రుళ్లు ట్రాక్టర్లు, ట్రక్కుల్లో తరలింపు
- ఇప్పటి వరకు 25 వేల టన్నుల ఇసుక మాయం
- ఫిర్యాదులు వచ్చినా కన్నెత్తి చూడని ప్రాజెక్టు అధికారులు

పొన్నలూరు: పొన్నలూరు మండలం చెన్నిపాడు సమీపంలోని సంగమేశ్వరం వద్ద మాకేరు–పాలేరు నదిపై మధ్య తరహా జలాశయం నిర్మాణానికి 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖ రరెడ్డి నిధులు మంజూరు చేశారు. అయితే ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మొదటి నుంచి సక్రమంగా పనులు చేపట్టకపోవడంతో 19 ఏళ్లగా పనులు ముందుకు సాగలేదు. కేవలం 25 శాతం మాత్రమే జరిగాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తరచూ కాంట్రాక్టర్లను మారుస్తూ వచ్చింది. తరువాత 2018లో ప్రాజెక్టు నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మట్టికట్ట, స్పిల్‌వే పనులు చేపట్టారు. స్పిల్‌వేకు రెండువైపులా 2.8 కిలోమీటర్ల పొడవున మట్టికట్ట నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. మట్టికట్ట నిర్మించే ప్రాంతంలో పది అడుగుల మేర గుంత తీశారు. సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న నాణ్యమైన ఇసుకను వృథా చేయకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఉపయోగించవచ్చని అధికారులు భావించారు.

50 వేల టన్నుల ఇసుక నిల్వ

మట్టికట్ట నిర్మాణ ప్రాంతం నుంచి పొక్లెయిన్ల ద్వారా తవ్వి, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించారు. అలా సుమారుగా 50 వేల టన్నుల ఇసుకను నిల్వ చేశారు. ఇసుక తరలించేందుకు వినియోగించిన ట్రాక్టర్లు, పొక్లెయిన్లకు సుమారు రూ.2.50 కోట్లు చెల్లించారు. అలాగే స్పిల్‌వే నిర్మించే ప్రాంతంలో కూడా పెద్దపెద్ద రాళ్లు ఉండటంతో వాటిని కూడా బ్లాస్టింగ్ చేసి రాళ్లను తొలగించారు. ఈ తొలగించిన రాళ్లను కూడా సైజ్ చేసి ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఉపయోగించవచ్చని లారీలతో పక్కకు తరలించి నిల్వ చేశారు.



స్పిల్‌వే పనుల్లో భాగంగా పెద్ద పెద్ద రాళ్లను బ్లాస్టింగ్ చేసి నిల్వ చేస్తున్న దృశ్యం

రూ.3 కోట్ల ఇసుక, రాళ్లు మాయం...

2018 నుంచి 2024 వరకు ప్రాజెక్టు నిర్మాణం కోసం నిల్వచేసిన ఇసుక, రాళ్ల జోలికి ఎవ్వరూ వెళ్లలేదు. కొందరు అక్రమార్కులు 2022లో రాళ్లను తరలించేందుకు యత్నించగా అధికారులు అడ్డుకున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ఇసుకను, రాళ్లను, మిగిలిన వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో వాటి జోలికి ఎవరూ పోలేదు. ఎప్పటి నుంచో వీటిపై కన్నేసిన తెలుగుదేశం పార్టీ నేతలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెచ్చిపోయారు. ఇసుక, రాళ్లను రాత్రుళ్లు వాహనాల్లో తరలించుకుపోయారు. తొలుత పొక్లెయిన్ సహాయంతో ఇసుకను తోడేశారు. రాత్రుళ్లు ట్రాక్టర్లలో తరలించేశారు. ఆరు నెలల్లో సుమారుగా 25 వేల టన్నుల ఇసుకను దోచేసినట్టు సమాచారం. దీని విలువ సుమారు రూ.2.5 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. అలాగే నిల్వ చేసిన రాళ్లను కూడా అవకాశం దొరికినప్పుడు ట్రక్కుల్లో తరలించారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలకు పైగా ఉంటుంది.

పట్టించుకోని ప్రాజెక్టు అధికారులు...

సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ కోసం నిల్వ చేసిన 50 వేల టన్నుల ఇసుకను, రాళ్లను అక్రమంగా అక్రమార్కులు తరలిస్తుంటే ప్రాజెక్టు అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. టన్నుల కొద్దీ ఇసుకను దోచేస్తుంటే పట్టించుకోకుండా ప్రేక్షకపాత్ర వహించారు. దీనిపై కొందరు గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక, రాళ్ల తరలింపును అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ఎస్సీ బాలుర హాస్టల్ పునః ప్రారంభం

- అడ్మిషన్లు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు



పొన్నలూరులో తెరుచుకున్న ఎస్సీ బాలుర హాస్టల్

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: గ్రామీణ ప్రాంత విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా వారి సౌకర్యార్థం మండల కేంద్రమైన పొన్నలూరులో 2016లో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కొత్తగా ఏర్పాటు చేశారు. దీంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు వివిధ మండలాల నుంచి పేద విద్యార్థులు హాస్టల్‌లో చేరి స్థానిక ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వసతి గృహం అద్దె భవనంలో ఏర్పాటు చేసినా ఎనిమిదేళ్ల పాటు చుట్టు పక్కల విద్యార్థులకు వసతి కల్పించి చదువుకోవడానికి అవకాశం కల్పించారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో మొదట మూడు నెలలు హాస్టల్ నిర్వహించినా వార్డెన్ లేకపోవడంతో పాటు అధికారులు నిర్లక్ష్యం వలన సరిపడిన విద్యార్థుల సంఖ్య లేదంటూ ఇటీవల హాస్టల్‌ని పూర్తిగా మూసివేసి సామగ్రిని తరలిస్తున్నారు. దీంతో హాస్టల్ మూసివేతపై ఆదివారం 'సాక్షి'లో 'ఎస్సీ బాలుర హాస్టల్ మూసివేత' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఒంగోలు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ వెంటనే ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి మంగళవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విద్యార్థులను అడ్మిషన్ చేయాలని ఇన్‌చార్జి వార్డెన్‌తో పాటు కింది స్థాయి అధికారులకు ఆదేశించారు. దీంతో సిబ్బంది సోమవారం హాస్టల్‌ని తెరచి శుభ్రం చేశారు.

విద్యుత్ మీటర్స్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



విద్యుత్ రీడర్ల సమస్యలపై ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లాలో గత 15 ఏళ్లుగా 250 మంది విద్యుత్ రీడర్లుగా పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న స్మార్ట్ మీటర్ల వలన వారి ఉపాధి దెబ్బతింటుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ నగర నాయకులు శ్రీరాం శ్రీనివాసరావు, అనిల్ కుమార్, సతీష్ కుమార్, బి.నారాయణ, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దళితులు, గిరిజనులపై పెరిగిన దాడులు



కేవీపీఎస్ వర్క్‌షాపు పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో దళితులు, గిరిజనుల మీద దాడులు పెరిగిపోయాయని, దళితులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు తెలిపారు. స్థానిక ఎల్బీజీ భవనంలో సోమవారం నిర్వహించిన కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 14, 15 తేదీల్లో ఒంగోలులో దళితుల సమస్యల మీద రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్రంలో దళితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తారన్నారు. రాబోయే రోజుల్లో దళితుల సమస్యల మీద రాష్ట్ర స్థాయి పోరాటాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దళిత ఉద్యోగులు, మేధావులు, అభ్యుదయ వాదులు, ప్రజాతంత్ర వాదులు ఈ వర్క్‌షాపులో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని, అత్యాచారాలు, హత్యలు పేట్రేగి పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని దళితులలో నేటికీ వెనకబాటుతనం ఉండడం బాధాకరమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం అన్నారు. శ్మశానాల సమస్య జిల్లాలో దళితులకు సవాల్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల శ్మశానాల సమస్యల మీద ప్రత్యేకంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. అనంతరం వర్క్‌షాపునకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, మోజేష్, మేకల రామయ్య, అంగలకుర్తి సూరిబాబు, దిడ్ల నారాయణ, సంజీవరావు, కాకుమాను సుబ్బారావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సమస్యల పరిష్కారం

- ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా

ఒంగోలు: ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి పరిష్కార వేదిక అని ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా పేర్కొన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల ఆమోదంతోనే న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. దీని వల్ల న్యాయ స్థానాల మీద తీవ్రమైన ఒత్తిడి తగ్గడమే కాకుండా పనిభారం కూడా కొంత వరకు తగ్గుతుందన్నారు. మధ్యవర్తిత్వ అంశానికి సంబంధించి శిక్షకురాలిగా జయగోయల్, నగీనా జైన్ అనే సుప్రీంకోర్టు న్యాయవాదులు హాజరయ్యారని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి.రాజా వెంకటాద్రి, డి.రాములు, పి.లలిత , సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.దీనా, ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, ఇతర న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మధ్యవర్తిత్వం ప్రాధాన్యత, దానిని న్యాయస్థానాల్లో ఎలా అమలుచేస్తారు తదితర అంశాల గురించి సుప్రీంకోర్టు న్యాయవాదులు అవగాహన కల్పించారు.

పోస్టల్ ఉద్యోగి..ఖోఖోలో మెరిసి

- విశ్వవిజేత భారత జట్టులో సత్తాచాటిన జిల్లా వాసి పోతిరెడ్డి శివారెడ్డి
- స్వగ్రామం ముండ్లమూరు మండలం ఈదర
- జట్టులో కీలక పాత్ర పోషించి విజయకేతనం ఎగరేసి..
- రైతు కుటుంబానికి చెందిన శివారెడ్డి పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగి
- ఎందరు నిరాశపరిచినా అడుగులు ముందుకు వేసిన వైనం



ప్రత్యర్థిని ఔట్ చేస్తూ..

దర్శి: ఎన్ని ఆటంకాలొచ్చినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని విజయం సాధించాలన్న సంకల్పం ఆ యువ క్రీడాకారుడిని విశ్వవేదికపై నిలిపింది. చిన్నతనం నుంచి ఆసక్తి ఉన్న ఖోఖో క్రీడలో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికై జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన పోతిరెడ్డి శివారెడ్డి ఖోఖో క్రీడాకారుడు. స్పోర్ట్స్ కోటాలోనే పోస్టల్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తూ తనకిష్టమైన క్రీడ ఖోఖోలో సత్తా చాటుతున్నాడు. ఈక్రమంలో భారత జట్టుకు ఎంపికై ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఖోఖో వరల్డ్ కప్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాడు. ఈ పోటీల్లో భారత జట్టు అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించి వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. భారత్–నేపాల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శివారెడ్డి బెస్ట్ ఎటాకర్‌గా అవార్డు అందుకున్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో 54 సెకన్లలో మూడు అవుట్‌లు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తనదైన శైలిలో ఆటలో సత్తా చాటి ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలతో పాటు దేశం మొత్తం గర్వించేలా తన ప్రతిభ చాటాడు. ఈ వరల్డ్ కప్‌లో మొత్తం 20 దేశాలు పాల్గొన్నాయి.



జాతీయ పతాకంతో శివారెడ్డి

బూచేపల్లి అభినందనలు

దర్శి: ఖోఖో వరల్డ్ కప్ చాంపియన్ షిప్ లో విజయం సాధించిన భారత జట్టులో సభ్యుడైన పోతిరెడ్డి శివారెడ్డికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అభినందనలు తెలిపారు. ఎంతో కృషి చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన శివారెడ్డి కష్టం దేశం గర్వించేలా చేసిందని కొనియాడారు. ఇటువంటి మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారుడు తమ నియోజకవర్గంలో ఉండటం తమకెంతో ఆనందంగా ఉందన్నారు.

నిరాశపరిచినా వెనుదిరగలేదు

రైతు కుటుంబానికి చెందిన శివారెడ్డి తండ్రి గురవారెడ్డికి పోలియో ఉంది. 10 ఎకరాల మెట్ట భూమి ఉంది. మెట్ట పంటలు వేసి తండ్రి గురవారెడ్డి, తల్లి కోటేశ్వరమ్మలు కూలీల ద్వారా వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. చిన్నప్పటి నుంచి ఆటలంటే మక్కువ ఉన్న శివారెడ్డి నిరంతర సాధన చేసేవాడు. ఎంతో మంది తెలిసిన వారు, బంధువులు నీకు ఆటలెందుకు చదువుపై దృష్టి సారించమని నిరాశ పరిచే వారు. ఆటల్లో తనకు ఉన్న ప్రతిభను ఎవరూ గుర్తించలేక పోయారు. అయితే శివారెడ్డి మాత్రం నిరాశ చెందలేదు. క్రీడల్లో ఎక్కడా వెనుకడుగు వేయలేదు.

ఖోఖో పయనం ఇలా..

శివారెడ్డి 2006 నుంచి ఖోఖోలో సాధన మొదలు పెట్టాడు. 6 నుంచి 9వ తరగతి చదుకుంటున్న సమయంలో కాశీవిశ్వనాథరెడ్డి అనే అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు ఆటలో శివారెడ్డికి మెళకువలు నేర్పారు. అ తరువాత మధు అనే మరో కోచ్ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పంగులూరు లో ఒక సంవత్సరం పాటు శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత వచ్చిన మేకల సీతారామిరెడ్డి అనే కోచ్ శివారెడ్డి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎటువంటి అడ్డంకులు వచ్చినా వాటిని అధిగమించేలా చేసి ముందుకు తీసుకుని వెళ్లారు. సీనియర్ ఆటగాళ్లు శివారెడ్డిని నిరాశపర్చినా అన్నీ విధాలా అండగా ఉండి ముందుకు నడిపించారు. ఒకానొక సమయంలో తల్లిదండ్రులు సైతం క్రీడలు వద్దని చదువుకోమని, లేదంటే వ్యాపారం పెట్టుకోమని శివారెడ్డిని ఒత్తిడి చేశారు. ఆ సమయంలో అతని తల్లిదండ్రులకు సర్ది చెప్పి పంగులూరులోనే అన్నీ మెళకువలు నేర్పి అంచెలంచెలుగా ఎదిగేలా శివారెడ్డిని తీర్చి దిద్దారు. 2018లో లండన్‌లో జరిగిన అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపడంతో అప్పటి నుంచి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. శివారెడ్డి తమ్ముడు పరమేశ్వరరెడ్డి కూడా విలేజ్ సర్వేయర్‌గా స్పోర్ట్స్ కోటాలోనే ఉద్యోగం సంపాదించారు.



తల్లి దండ్రులతో శివారెడ్డి, అతని సోదరుడు పరమేశ్వరరెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి



గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి మీకోసం గ్రీవెన్స్ కార్యాక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. దీనిలో మొత్తం 302 అర్జీలు కలెక్టర్‌కు అందాయి. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల తాలూకు సమస్యలకు సకాలంలో శాశ్వతమైన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం కాని సమస్యలుంటే వాటి గురించి పూర్తి వివరాలను అర్జీదారులకు వివరించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. నిర్ణీత సమయం దాటి అర్జీలు ఎటువంటి పరిస్థితిలోను పెండింగ్‌లో ఉండ కూడదన్నారు. ప్రతిరోజు లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. దీనిలో డీఆర్‌ఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు వరకుమార్, విజయజ్యోతి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

■ మాలమహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి వైద్య ఆరోగ్య శాఖలోని సమస్యలపై అర్జీ అందజేశాడు. కోర్టు ఉత్తర్వుల మేరకు కుటుంబ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో కరవది అనిల్ అనే వ్యక్తికి ఉద్యోగంలో చేరేందుకు అనుమతి ఇవ్వాలని, అదేవిధంగా కట్టా రాజేష్‌బాబు సదరం సర్టిఫికెట్‌కు సంబంధించి వచ్చిన ఆరోపణలపై హైకోర్టు ఉత్తర్వుల మేరకు విచారణ జరిపించాలని కోరాడు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న పలు అంశాలపై దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశాడు.



కలెక్టర్ కు తన గోడు వెళ్లబోసుకుంటున్న వృద్ధురాలు

బీసీ సంఘ నాయకుడు కొటికలపూడి జయరాం గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి సంబంధించి మహిళా ఉద్యోగి ఒకరు బీసీ రిజర్వేషన్‌ను వినియోగించుకున్నారని, దానిపై జరిగిన విచారణకు సంబంధించి నాటి డీఈఓ తప్పుడు నివేదిక ఇచ్చారని ఫిర్యాదు చేశారు. 2008 డీఎస్సీలో గ్రేడ్–2 తెలుగు పండిట్ పోస్టుకు సంబంధించి ఈ అవకతవక జరిగిందని, అయితే ఆ ఉద్యోగి ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందారని తప్పుడు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. పరిశీలించి సరైన నివేదక పొందుపరిచేలా మళ్లీ విచారణ చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చాడు.

కొడుకులు అన్నం పెట్టడం లేదని ఫిర్యాదు

టంగుటూరు: కన్న కొడుకులే తిండి పెట్టడం లేదని టంగుటూరు మండలం నిడమనూరు గ్రామానికి చెందిన తంపనేని సౌభాగ్యమ్మ అనే వృద్ధురాలు సోమవారం ఒంగోలులో మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను వేడుకుంది. కలెక్టర్‌తో వృద్ధురాలు మాట్లాడుతూ ఏ పనీ చేయలేని వృద్ధురాలినని, నీవే న్యాయం చేసి..అన్నం పెట్టేలా చూడాలని కోరింది.

పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకార సంఘ ఉద్యోగులకు 2019 మార్చిలో విడుదల చేసిన జీఓ 36ను అమలు చేస్తామని మంత్రి అచ్చెంనాయుడు మాట ఇచ్చి తప్పారని అన్నారు. కంప్యూటరీకరణలో భాగంగా డీసీటీ, ప్రీ మైగ్రేషన్ చేస్తే మీ సమస్యలను పరిష్కరిస్తామని సహకార శాఖ కమిషనర్ చెప్పడంతో ఉద్యోగులు ఎంతో ఆశతో రాత్రనక పగలనక ఆర్‌సీఎస్ ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో దశలవారీ ఉద్యమానికి సిద్ధమైనట్లు తెలిపారు. సహకార సంఘాల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, 2019 తరువాత జాయిన్ అయిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సహకార సంఘాలను ఇన్‌కం ట్యాక్స్ పరిధి నుంచి తప్పించాలని, 2019 పే రివిజన్‌ను అమలు చేయాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీతో కూడిన 36 జీఓను రాష్ట్రమంతా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 10 నుంచి నిరవధిక సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు వి.మనోజ్ కుమార్, రామాంజిరెడ్డి, ఆర్ శంకర్, రామిరెడ్డి, కె.సుబ్బారావు, మల్లికార్జునరావు, రాజేష్, రమేష్, కృష్ణ, చైతన్యతో పాటుగా 250 మంది పాల్గొన్నారు.



పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

క్లుప్తంగా

వెటరన్ టెన్నిస్‌లో గిద్దలూరు వాసుల సత్తా



టెన్నిస్ విజేతలను అభినందిస్తున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: నరసరావుపేటలో ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించిన వెటరన్ టెన్నిస్ టోర్నమెంట్(65 ఏళ్లు పైబడిన విభాగం) డబుల్స్‌లో గిద్దలూరుకు చెందిన కంచర్ల కోటయ్యగౌడ్, శశిభూషణ్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. గుంటూరుకు చెందిన టీవీ రావు, తిరుపతిరెడ్డిపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డితో పాటు గిద్దలూరు టెన్నిస్ కోర్టు అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డి, రీక్రియేషన్ క్లబ్ కోశాధికారి త్రిమూర్తిరెడ్డి తదితరులు అభినందించారు.

ఎస్పీని కలిసిన విజిలెన్స్ ఏఎస్పీ, కనిగిరి డీఎస్పీ

ఒంగోలు టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా కనిగిరి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కె.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీని కలిశారు.

ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలి

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు సజావుగా నిర్వహించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కందకం తవ్వకాలు, నీటి వనరుల్లో పూడిక తీత పనులు, అమృత్ సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి, గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఆయా పనులను రోజూ పర్యవేక్షించాలని ఏపీఓలను ఆదేశించారు. కేవలం మూడో శనివారం మాత్రమే కాకుండా పారిశుధ్య పనులు రోజు విధిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మీ కోసం అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీపీఓ వెంకటనాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాపురాల్లో సెల్ చిచ్చు!

- దొనకొండ మండలం రుద్రవరంలో ఉద్రిక్తత
- భార్యకు మరో వ్యక్తి సెల్‌ఫోన్ కొనిచ్చాడని భర్త ఆగ్రహం
- బంధువులతో కలిసి ఎస్టీ కుటుంబంపై దాడి
- రేకుల షెడ్, ఆటో, రెండు బైకులకు నిప్పు
- కులం పేరుతో దూషించి, దాడి చేశారని బాధితుల ఫిర్యాదు



కాలిపోయిన రేకుల షెడ్



దగ్ధమైన ఆటో

దొనకొండ: తన భార్యకు పక్కింటి వ్యక్తి సెల్‌ఫోన్ కొనిచ్చాడని తెలిసి తీవ్ర ఆగ్రహానికి గురైన ఓ వ్యక్తి బంధువులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. దొనకొండ మండలంలోని రుద్రవరం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల కథనం మేరకు.. రుద్రవరంలో దుగ్గెంపూడి మల్లికార్జున, మోటా వెంకటేశ్వర్లు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. ఈ నెల 16వ తేదీన మోటా వెంకటేశ్వర్లు ఆటోలో దొనకొండ వెళ్లిన మల్లికార్జున భార్య రూ.800 సెల్‌ఫోన్‌తో ఇంటికి చేరుకుంది. అదేరోజు రాత్రి సెల్‌ఫోన్‌ను చూసి భర్త ప్రశ్నించగా మోట వెంకటేశ్వర్లు ఆటోలో దొనకొండ వెళ్లి తెచ్చుకున్నానని చెప్పింది. దీంతో మల్లికార్జున కోపోద్రిక్తుడై వెంకటేశ్వర్లు వద్దకు వెళ్లి 'నా భార్యకు సెల్‌ఫోన్ కొనిచ్చేవాడివా' అంటూ దాడి చేశాడు. ఈ పరిణామంతో వెంకటేశ్వర్లు ఊరు విడిచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వెంకటేశ్వర్లు భార్య శివమ్మ వద్దకు వెళ్లి 'నీ భర్త ఎటుపోయాడు. మీరు మా ఛాయల్లో ఉండటానికి వీల్లేదు' అంటూ గద్దించారు. ఆదివారం తన భార్యతో కలిసి దొనకొండ పోలీసులకు మల్లికార్జున ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులుగా జరిగిన పరిణామాలన్నీ గుర్తు చేసుకుని, మరో 10 మంది వ్యక్తులతో కలిసి మద్యం తాగి ఆదివారం రాత్రి మోట వెంకటేశ్వర్లు నివాసం ఉంటున్న రేకుల షెడ్‌తోపాటు ఆటో, రెండు బైకులకు నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. తాము ఎరుకలోళ్లమని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆస్తి ధ్వంసం చేశారని శివమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. త్రిపురాంతకం సీఐ హసన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

'మద్యం వల్లే సార్ గొడవలు'

రుద్రవరంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన సీఐకి గ్రామస్తులు మద్యం అక్రమ విక్రయాల గురించి వివరించారు. గ్రామ నడిబొడ్డులో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని చెప్పారు. 'గతంలో మా ఊరిలో మద్యం అమ్మేవారు కాదు, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. మద్యం తాగినోళ్లు ఘర్షణలకు దిగుతున్నారు' అని గ్రామానికి చెందిన కొందరు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. బెల్టుషాపులు తొలగించకుంటే ఊరంతా కలిసి నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

మా భూమి మాకు ఇప్పించండి సారూ...

- అధికార అండతో ఆగని టీడీపీ నేత ఆగడాలు
- దళితుల భూమిని ఆక్రమించి వారిపైనే ఫిర్యాదు
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళితుల నిరసన



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రావిళ్లవారిపాలెం గ్రామ దళితులు



పూర్వీకుల సమాధి ఏర్పాటు చేసుకున్నా వదలకుండా టీడీపీ నాయకుడు పాలెపు రమణయ్య ఆక్రమించుకున్న దళితుల భూమి

మద్దిపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఏం చేసినా చెల్లుతుందని టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. మండలంలోని రావెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత దాదాపు రూ.2.5 కోట్ల విలువైన దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని, నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించి..యథేచ్ఛగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నాడు. ప్రశ్నించిన దళితులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దళితులు మా భూమిని మాకు ఇప్పించాలంటూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. రావెళ్లవారిపాలెం మాజీ సర్పంచ్ పాలెపు పద్మ భర్త అయిన పాలెపు రమణయ్య టీడీపీ గ్రామ స్థాయి నాయకుడిగా చలామణి అవుతున్నాడు. గ్రామంలో దళిత సామాజికవర్గానికి చెందిన పులగం నరసమ్మకు చిమట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 727-1లో 1.63 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ఆమె కుమారులకు పంపకం కుదరకపోవడంతో అలాగే వదిలేశారు. దీంతో కొన్నాళ్లుగా అది బీడుగా ఉంది. ఆ భూమిని ఆనుకున్న ఉన్న భూమి యజమాపి అయిన పాలెపు రమణయ్య కన్ను దానిపై పడింది. నర్సమ్మ కుమారులకు తెలియకుండా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలెపు రమణయ్య కుమార్తె ప్రశాంతి పేరున ఆన్‌లైన్ చేయించాడు. అలాగే గ్రామానికి చెందిన పులగం పెదకోటయ్యకు 40 ఏళ్ల క్రితం సర్వే నంబర్ 727-19లో 1.88 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని ప్రభుత్వం ఇచ్చింది. ఈ భూమిని కూడా హక్కుదారునికి తెలియకుండా పాలెపు రమణయ్య కుమారుడు తిరుపతినాయుడు పేరు మీద ఆన్‌లైన్ ఎక్కించుకుని నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించారు. అలాగే రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళ సాలసా చినమ్మకు సర్వే నంబర్ 740-3లో 0.92 ఎకరాల భూమి ఉంది. దీనిని కూడా ఆమెకు తెలియకుండా రమణయ్య కుమార్తె ప్రశాంతి పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నాడు. ఇలా చిమట, జువ్విగుంట రెవెన్యూ పరిధిలో సుమారు రూ.2.5 కోట్ల విలువైన భూములను కబ్జా చేసినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 ఏళ్ల క్రితం ప్రభుత్వం సాగుచేసుకునేందుకు ఇచ్చిన అసైన్డ్ భూములను తమకు తెలియకుండా టీడీపీ నాయకుడు పాలెపు రమణయ్య ఆయన కుటుంబ సభ్యుల పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని, నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించారని దళితులు వాపోయారు. పేదల భూములను ఆక్రమించుకుని అనుభవిస్తుందే కాక తిరిగి మాపైనే మద్దిపూడి పోలీస్‌స్టేషన్‌లో రమణయ్య, ఆయన కుమారులు తిరుపతయ్య, వెంకటేశ్వర్లు ఆదివారం ఫిర్యాదు చేశారని గ్రామానికి చెందిన దళితులు పులగం పెదకోటయ్య, పులగం చిన్నకోటయ్య, సాలసా చెన్నమ్మ, పులగం కోటయ్య, యర్రజెన్ను బ్రహ్మయ్య, పులగం అంకమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేసి వినతి పత్రాన్ని అందజేశారు. న్యాయం జరిగేంత వరకు పోరాడతాయని వారు భీష్మించారు. మద్దిపూడి ఎస్ఐ రమేష్‌బాబు దళితుల వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం న్యాయం చేస్తామనడంతో తమ నిరసన విరమించారు.

నా బిడ్డ ఆచూకీ తెలపండి..

- వైఎస్సార్ సీపీ కార్యకర్తను అర్ధరాత్రి తీసుకెళ్లిన పోలీసులు
- 24 గంటలు గడిచినా ఆచూకీ లేదని తల్లి ఆందోళన



ఈర్లసాయి తల్లి సలోమి

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ఓ యువకుడిపై అక్రమ కేసులు బనాయించిన పోలీసులు అర్ధరాత్రి ఇంటి నుంచి తీసుకెళ్లడంతో పాటు 24 గంటలు గడుస్తున్నా ఇప్పటి వరకు కూడా అతని ఆచూకీ తల్లికి తెలపకపోవడంతో ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. వివరాల్లోకి వెళ్తే..భోగి పండుగ రోజు స్థానిక ఎస్టీ కాలనీలో చోటుచేసుకున్న చిన్న వివాదంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈర్ల సాయి విషయంలో రాజీ చేశారు. అయితే గ్రామంలో టీడీపీ నేతలు అదే అదనుగా భావించి అతని మీద మరో రెండు కేసులు నమోదు చేయాలని పోలీసులపై ఒత్తిడి చేశారు. ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు ఈర్ల సాయి (20)పై కేసులు నమోదు చేసి ఆదివారం అర్ధరాత్రి ఒంగోలులో అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి వరకు కూడా అతని ఆచూకీ తెలపలేదు. దీనిపై యువకుని తల్లి ఈర్ల సలోమి నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో అడిగినా సమాధానం లేకపోవడంతో ఒంగోలు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి విచారించినా తన కుమారుడి ఆచూకీ చెప్పడం లేదని.. తన బిడ్డను ఏమైనా చేశారా అని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తోంది.

గ్రామంలో ఐదు రోజుల్లో ఏడుగురికి రిమాండ్..

సంక్రాంతి పండుగ వేళల్లో గ్రామాల్లో చోటు చేసుకున్న చిన్నపాటి వివాదాలను రాజకీయంగా వినియోగించుకోవాలని గత ఐదు రోజుల్లో ఒక్క అమ్మనబ్రోలు గ్రామంలోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇదే గ్రామంలో కనుమ పండుగ రోజు టీడీపీ కార్యకర్తలు ముగ్గురు మద్యం తాగి గొర్రెలను తొక్కించబోతే.. చూసి బండి నడపమన్నందుకు కొణికి రాఘవ అనే యువకుడిని విచక్షణ రహితంగా కొట్టడంతో రాఘవకు పక్కటెముకలు విరిగాయి. ఈ కేసులో పోలీసులు దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులపై నామమాత్రపు కేసులు నమోదు చేశారని సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేత బీడు ఆక్రమణపై సబ్‌కలెక్టర్ విచారణ

- సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన బుడ్డపల్లి గ్రామస్తుడు
- ఆక్రమణలు తొలగించాలని ఆదేశించిన సబ్ కలెక్టర్



విచారణ చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన అధికారులు

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి పంచాయతీ పరిధిలోని బుడ్డపల్లిలో పశువుల బీడును ఆక్రమించారని గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు వారం రోజుల క్రితం సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎంఓ ఆదేశాల మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి గోడలు నిర్మించారని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏడుకొండలు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నంబరు 112లో 6 ఎకరాలు, 113లో 7.9 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు క్వారీలకు అమ్ముకున్నారని, సర్వే నంబర్ 109/1లో 2.76 ఎకరాలు, 109/3లో 5.86 ఎకరాల పశువుల మేతబీడు భూమిలో ప్లాట్లు వేసి అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా సర్వే నంబర్లు 294, 330, 317, 338, 291లోనూ ఆక్రమణలు జరిగాయని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి రికార్డులు ఏమైనా ఉన్నాయా అని వారిని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా గ్రామస్తులు కొందరు తమకు ఇళ్ల స్థలాలు లేవని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అర్జీలిస్తే పరిశీలిస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ విజయభాస్కర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- పామూరులో ఆక్రమిత భూములను పరిశీలించిన ఆర్‌జేసీ



ఆలయ భూముల్లో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ

పామూరు: దేవస్థాన భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్(ఆర్‌జేసీ) ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన పామూరు-నెల్లూరు రోడ్డులో ఆక్రమణకు గురైన శ్రీవల్లీ భుజంగేశ్వర, మదన వేణుగోపాలస్వామి ఆలయ భూములు, వాటిలో నిర్మించిన ఇళ్లు, చర్చిలను క్షేత్రస్థాయిలో ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబుతో కలిసి పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసులిచ్చి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని ఈఓను ఆదేశించారు. ఆలయ భూముల్లో చర్చి నిర్మించారని బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య ఆర్‌జేసీ దృష్టికి తీసుకురాగా తక్షణమే తొలగించాలని ఈఓకు సూచించారు. అనుమలశెట్టి సత్రం, వీరబ్రహ్మంద్రస్వామి ఆలయ ఆస్తులపై నివేదిక ఇవ్వాలని ఏఈఓ నరసింహబాబుకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, ఎస్.నరసింహులు, పశుపులేటి రఘురాం, బండ్లా నారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

సీఎస్‌పురం(పామూరు): మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌జేసీ ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. సోమవారం నారాయణస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. గతంలో నిర్వహించిన వేలం బకాయిలు వసూలు చేసి ఆలయ ఖాతాలో జమ చేయాలని ఈఓ నరసింహబాబుకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకేశ్వరాలయ ఆదాయం రూ.30.63 లక్షలు

త్రిపురాంతకం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయానికి కానుకల రూపంలో రూ.30,63,593 ఆదాయం వచ్చినట్లు ఏఈఓ రజనీకుమారి సోమవారం తెలిపారు. 4 నెలలు 24 రోజుల వ్యవధిలో స్వామి వారి హుండీ ద్వారా రూ.10,93,676, అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.18,73,825, అన్నదానం హుండీ ద్వారా రూ.96,092 సమకూరాయని వివరించారు.

నమ్మించి మోసం చేశారు

- ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు బాధితుల మొర



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో రోజురోజుకూ మోసాలు పెరిగిపోతున్నాయి. ఉద్యోగం ఇప్పిస్తానంటూ కొందరు, వ్యాపారం పేరుతో మరికొందరు అమాయకులను నమ్మించి ముంచుతున్నారు. లక్షలాది రుపాయలు కాజేసి ఒట్టి చేతులు చూపుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పెద్దగా భయపడటం లేదు. మోసగాళ్లకు శిక్షలు పడకపోవడంతో బరితెగిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లినా తిరిగి వచ్చి మళ్లీ మోసాలకు తెగబడుతున్నారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల వేదికలో మోసాల గురించి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా సరే మోసగాళ్లు లెక్కచేయడం లేదు. తాజాగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో ఈ తరహా మోసాలపై రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ రెండు కేసుల్లో బాధితులు రూ.16.55 లక్షలు పోగొట్టుకున్నారు. దర్శి సమీపంలో చేపల చెరువును లీజుకు ఇప్పిస్తానంటూ ఒంగోలు భాగ్యనగర్‌కు చెందిన ఒకరు తమ ఐదుగురి నుంచి విడతలవారీగా రూ.13.10 లక్షలు తీసుకున్నాడని కొండపి మండలానికి చెందిన వ్యక్తి ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్రంలోని ఏదైనా ఒక యూనివర్సిటీలో తమ కుమారుడికి కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ కృష్ణా జిల్లాకు చెందిన ఒక వ్యక్తి రూ.3.45 లక్షలు తీసుకుని మోసం చేశాడని తాళ్లూరు మండలానికి చెందిన ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. విచారణ చేపట్టి తగిన న్యాయం చేయాలని ఆదేశించారు. ఉద్యోగాలు, వ్యాపారాల పేరిట జరుగుతున్న మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ దేవ ప్రభాకర్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారి స్వామి భక్తి

- టీడీపీ కార్యాలయంలో పశువైద్య శిబిరాల పోస్టర్ ఆవిష్కరణ



టీడీపీ కార్యాలయంలో పశువైద్య శిబిరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీసాయి

పామూరు: మండల పశు వైద్యాధికారి ఈమని శ్రీసాయి స్వామి భక్తిని ప్రదర్శించారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాల వాల్‌పోస్టర్‌ను పామూరు మండల టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. పోస్టర్‌ను వైద్యశాలలో లేదా గ్రామాల్లో ఆవిష్కరించాల్సి ఉండగా సోమవారం వెటర్నరీ అసిస్టెంట్ ఖాదర్‌బాషాతో కలిసి టీడీపీ కార్యాలయానికి చేరుకున్న డాక్టర్ శ్రీసాయి మండల టీడీపీ నాయకుల కోసం వేచి ఉండి మరీ పోస్టర్‌ను ఆవిష్కరించడం గమనార్హం. డాక్టర్ శ్రీసాయి వైద్యశాలలో అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి. పార్టీలకు అతీతంగా సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఉద్యోగి ఇలా పార్టీ కార్యాలయంకు వెళ్లి స్వామి భక్తి చాటుకోవడంపై పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

హంతకులను శిక్షించండి

- గిద్దలూరు పోలీసు స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల ధర్నా

గిద్దలూరు రూరల్: తమ పిల్లవాడిని హత్య చేసిన వారిని శిక్షించి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని కె.ఎస్.పల్లె ఎస్సీపాలేనికి చెందిన పలువురు సోమవారం గిద్దలూరు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. గత ఏడాది అక్టోబర్ 28వ తేదీన గడ్డం ఆనంద్(19) అనే యువకుడు పట్టణంలోని సెయింట్‌పాల్స్ బీఈడీ కళాశాల వెనుక నీటి కుంటలో మృతి చెందాడు. ఆనంద్ తల్లిదండ్రులు లేకపోవడంతో అతడి చిన్నమ్మ వద్ద పెరిగాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆనంద్‌ను స్నేహితులే హత్య చేసి నీటి కుంటలో పడేశారని ఆరోపిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనిపై సీఐ కె.సురేష్ స్పందిస్తూ.. నాలుగు రోజుల్లో పోస్టుమార్టం నివేదిక వస్తుందని, దాని ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని, హత్య అని నిర్ధారణ అయితే నిందితులను శిక్షిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆనంద్ బంధువులు